మరో పావుగంట గడిచిందో లేదో యుద్ధభేరిలా పిడుగులు పడుతున్న చప్పుడు. అంతకు మించి చీకటిని విద్యుత్ ఖడ్గాల్లా చీల్చుతున్న మెరుపులు. . . ఏకాగ్రత భగ్న మైపోయింది. ఏ దావానలపు ఉష్ణోగ్రతా వలయాలో ప్రపంచాన్ని చుట్టుముడుతున్నట్టు ప్రకృతి భీతావహంగా మారిపోయింది.

నవలని ఓ మూల నుంచిన కృషి గదిలో వుండలేనట్టుగా బయటకు నడిచింది.

కుడి ప్రక్కనున్న బెడ్ రూంలో గ్రాండ్ పా లేడు.

బయట నిశీధి సముద్రం ఉప్పెనలా విరుచుకుపడుతున్నంత ఆందోళన్ని కలిగిస్తోంది.

నైటీ దిగువున వూరువుల్ని తాకుతున్న యోక్స్కర్ట్ బరువుగా అనిపిస్తూంటే కారిడార్‌లో నుంచి దిగువ హాల్ దాకా వచ్చింది.

నౌకర్లంతా నిద్రలోకి జారినట్టున్నారు. వుడ్ ఫ్లోరింగ్‌పైనున్న కార్పెట్ మాత్రమే కాదు, ఇటాలియన్ ఆర్కిటెక్టు ప్రత్యేకంగా డిజైన్ చేసిన మాన్సార్డ్ రూఫ్ కూడా సన్నగా కంపిస్తున్న అనుభూతి.

ఆ రోజెందుకో మరింత ఒంటరితనంగా వుంది.

రోబ్స్‌లో వున్న ఏంటిక్స్ గోడలకున్న ఖరీదైన తైలవర్ణ చిత్రాల్ని చూస్తుంటే ఇది తన సామ్రాజ్యం అనిపించడంలేదు. తనకోసం ప్రత్యేకంగా తయారుచేయబడిన బంగారు పంజరంలా కనిపించింది.

ఆమె ఆలోచనల నుంచి ఇంకా తేరుకోలేదు.

భళ్ళుమన్న చప్పుడు వినిపించింది.

అర్థ మైపోయింది ఆ శబ్దం ఎక్కడనుంచో.

ఒక్క ఉదుటున స్టెయిర్ కేస్ పైనుంచి బెడ్ రూంలోకి పరుగుతీసింది.

ఫ్రెంచి విండో పగిలి వుంది.

సెంట్రల్లీ ఎయిర్ కండీషన్డ్ గది కాబట్టి కిటికీ రెక్కలు మూసే వుంటాయి. గాలికి కొట్టుకునే అవకాశం లేనప్పుడు ఎలా పగిలిందది.

వెల్‌వెట్ కార్పెట్‌పై ముత్యాల్లా మెరుస్తున్న గాజు ముక్కలు.

ఇప్పుడు ఈదురుగాలి గదిలోకి ప్రభంజనంలా దూసుకొస్తూ ఆమె నైటీని వానతో తడిపేస్తూంది.

"గాడ్"

కృషి వేగంగా పక్కకి జరగబోతూ అప్పుడు చూసింది.

"నువ్వు" తడబడిపోయింది ధూర్జటిని చూస్తూ. "హౌడేర్ యూ ఆర్. . . ఎలా లోపలికి వచ్చావ్"

కెవ్వుమనబోతూ ఆగిపోయింది.

నౌకరు నిద్రలేవడం ఇలాంటి ఆకస్మిక దృశ్యాన్ని చూడటం ఆమెకిష్టం లేదు.

"లీవ్‌మి. . . వదులు" అతడి పట్టు సడలించాలని విఫలప్రయత్నం చేస్తుందామె.

"కృషి" అగ్నిరేఖల్లా కనిపిస్తున్న ఎర్రజీరలు అతడి కళ్ళల్లో "నన్ను చాలా తక్కువగా అంచనా వేసావ్"

ఇన్నాళ్ళూ కాపాడుకున్న యవ్వన పొంకానికి చరమాంకంలా అతడి చేతులు ఎక్కడో స్పృశిస్తున్నాయి.

"బా. . .స్ట. . . ర్డ్. . ." విరుగుతున్న వంతెనలా ఆమె మాటలు తడబడుతున్నాయి. "ఐ విల్ కిల్యూ."

నవ్వుతున్నాడు తోడేలులా.

పాయలుగా చీలుతున్న ఓ కన్య దు:ఖోద్విగ్నతని సేడిస్టిక్‌గా ఆనందిస్తున్నట్టు ఆమె శరీరంపై నైటీని చింపేసాడు అప్పటికే.

ఆమె గావు కేక ఆ భవంతి ప్రతిధ్వనించేదే. . .

కాని పెదవులతో ఆమె నోరు నొక్కేసాడు.

శిక్షగా మారుతున్న అక్షరాల అంత: స్వరాలహరులు. . .పగులుతున్న శతసహస్ర ప్రాకారాల సరిహద్దులు. . . అతడి చేతి వేళ్ళు ఉద్వేగంగా దేహంపై నర్తిస్తుంటే. . .

అప్పుడు చూసుకుంది.

తను పూర్తిగా నగ్నంగా మారింది.

కాదు అతడు మార్చేసాడు.

మండుతున్న గోళంలా ముందు నిలబడ్డ అతడి చూపుల్ని తాళలేనట్టు గభాలున పక్కకి జరిగి బెడ్‌పై వున్న బ్లాంకట్‌ని అందుకోబోయింది. అడ్డం పడ్డాడు.

పోరాటంలో గెలవటానికి ఆమె వజ్రాయుధం కాదు. వజ్రసంకల్పం కలదైనా ఓ బలవంతుడి బాహు పంజరాన్న నలిగిపోతున్న యువతి.

అంతే. . .

బాత్‌రూంలోకి పరుగెత్తింది.

గడియ పెట్టేదే కాని ఆమె చేతికన్నా ముందే అతడే కదిలి బాత్‌రూంలోకి దూసుకొచ్చాడు.

కృషి కంపించిపోతూంది "అవుట్"

ఆమె కేక బయటి ఉరుముల చప్పుడులో సమాధైంది.

"గెట్‌లాస్ట్" అశ్రుసిక్త నయనాలతో అరుస్తూ మరోదారి లేనట్టు చేతులు జోడించింది. వెనువెంటనే తన స్థితి గుర్తొచ్చినట్టు చేతులతో శరీరాన్ని కప్పుకుంది. "ప్లీజ్"

భావుకుడిలా చూసాడు "రిలాక్స్ బేబీ. . ."

ఖజురహో శిల్పంలా ఓమూల గోడకి అతుక్కుపోయిన కృషిని చూస్తూ అన్నాడు "ఎస్

నన్ను పోలీసులకి అప్పచెప్పావ్ దారుణమైన హింసకి గురిచేసావ్. అవును బేబీ. పోలీసులు నన్ను చాలా టార్చర్ చేశారు. నిన్ను అంతకన్నా టార్చర్ చేయాలని ఈ అర్ధరాత్రి వేళ ఇలా వచ్చాను."

"ఇప్పుడేం చేద్దామని"

"నిన్ను రేప్. . ." క్షణం ఆగాడు. "చేయను. అది నా కేరెక్టర్‌కే విరుద్ధం. కాబట్టి నిన్ను ఓ రెండు నిముషాలపాటు ఏకాగ్రతగా చూడాలనుకుంటున్నాను."

మొగ్గలా ముడుచుకుపోతూ అంది "ఎందుకు"

"నీ నగ్నదేహాన్ని చూసిన తొలిమగాడిగా నీకు కలకాలం గుర్తుండిపోవాలనుంది."

ఆ స్థితిలో సైతం ఆమె ఆశ్చర్యపడకుండా వుండలేకపోయింది. "దాని వలన నీకు కలిగేదేమిటి"

"సింపుల్"నవ్వాడు మృదువుగా "అందమైన నీ శరీరాన్ని రేపటి నుంచి నువ్వు చూసుకునేటప్పుడు గాని లేదు రేపు నిన్ను కట్టికున్నవాడు నిన్నూ నీ అందాన్ని బెడ్‌రూంలో అభినందించేటప్పుడు గాని ముందు నేను గుర్తుకొస్తాను. ఆ శిక్ష చాలు నీకు. . ."

ఇలాంటి శిక్ష కూడా ఒకటుంటుందని ఇప్పుడే తెలుసుకున్న కృషి అవాక్కయి చూస్తూండగానే వచ్చిన పనైనట్టు వెళ్ళిపోతున్నాడు.

వచ్చిన కిటికీలో నుంచి దర్జాగా రాజమార్గంలోనే.

ఇక నిభాయించుకోలేకపోయింది కృషి.

ఇంతసేపు అదిమి పెట్టుకున్న ఆ అవమానభారానికి గండిపడింది. వున్నట్టుంది గావుకేకలు పెట్టింది. "కేచ్ హిమ్ పట్టుకోండి"

ఒక్కసారి కాదు మూడుసార్లు. . .

"ఏమైదమ్మా" ఎవరో పలకరిస్తున్నారు.

పట్టుకోమంటుంటే ఏమైందీ అని ఆరా తీస్తున్నారేం.

"అతడ్ని ఆపండి"

"ఎవరతను"

అప్పుడు కళ్ళు తెరచింది కృషి.

అంతే కాదు.

సమీపంలో నిలబడివున్న నౌకర్లని చూస్తూ ఉలికిపాటుగా లేచింది.

బయట వర్షం లేదు. కిటికీ పగల్లేదు. . . అంతా ప్రశాంతంగా వుంది.

"పీడకలా అమ్మాయిగారూ" వృద్ధ నౌకరు శరభయ్య అడుగుతున్నాడు వినయంగా.

బ్లేంకెట్ కిందనుంచే శరీరం తడిమి చూసుకుంది. 'తను నగ్నంగా లేదు అంటే ఇంతసేపూ తనుపడిన సంఘర్షణ కలలోనే'

టీపాయ్‌పై వున్న నీళ్ళను అందుకుని గడగడా తాగేసింది.

"ఏదో కల. మీరు వెళ్ళండి"

"అంత ఘోరమైన కలా తల్లీ. మరేం లేదు. చాలా గట్టిగా కేకలు పెట్టావమ్మా" శరభయ్య మరింత వినయాన్ని ప్రదర్శించాడు.

"మీరు వెళ్ళండి"

"మరేం లేదమ్మా తెల్లవారుజామున వచ్చే కలలు నిజమవుతాయంటారు అంచేత అదేదో చెబితే"

ఆ స్టేట్‌మెంట్‌తో మరింత ఆవేశపడిన కృషి "వెళ్ళమని చెబుతుంటే మీక్కాదూ" అంది ఉక్రోషంగా.

వెళ్ళిపోయారు.

ఇప్పుడామెకి గుర్తుకొస్తున్నది కలగాదు. తెల్లవారుజామున వచ్చిన కలలు నిజమవుతాయన్న శరభయ్య స్టేట్‌మెంట్.

జుగుప్సగా వుంది.

సహజంగా ధైర్యవంతురాలయిన తనకిలాంటి కల వచ్చిందేం?

ధూర్జటి గురించి భయపడుతోందా?

అమెరికాలాంటి దేశంలో వుంటూ ఆత్మస్థయిర్యంతో చాలా సమస్యల్ని ఎదుర్కోగలిగిన తను ఇలా పిరికిదానిలా ఆలోచించడమేమిటి?

టు హెల్ విత్ ఇట్. . .

మరో అరగంటలో తయారయిన కృషి బ్రేక్ ఫాస్ట్ పూర్తయ్యాక మళ్ళీ నవల అందుకోబోతుంటే ఫోన్ రింగయ్యింది.

"ఎస్"

"కృషి" ఉపాధ్యాయ కంఠం వినిపించింది "నేను"

కృషి మొహంలోని రంగులు మారిపోయాయి. "చెప్పండి గ్రాండ్ పా"

"సింగపూర్ నుంచి మాట్లాడుతున్నాను. బహుశా రావటానికి మరో రెండు మూడు రోజులు పట్టచ్చు"

తనకు అవసరం లేనివి వినాలని ఉత్సాహపడని విషయం చెబుతున్నాడు. అక్కడితో ఆ చర్చ ఆగినా బాగుండేది.

"స్టేట్స్‌కి వెళ్ళిపోయావనుకున్నాను"

అది చెక్ చేయడానికే తాతయ్య ఫోన్ చేసాడని తెలీడంతో మనస్సు చివుక్కుమంది.

"వెళ్ళమని నేను అనటం లేదు కృషీ. మనిషి తను కోరినట్టు జీవించేదే నిజమైన జీవితం అని నమ్మేవాడిగా నీ నిర్ణయాన్ని అభినందిస్తానని చెబుతున్నాను."

"థేంక్స్ గ్రాండ్‌పా- " ముక్తసరిగా అంది "మీ ఆరోగ్యం జాగ్రత్త"

"ఆరోగ్యం గురించే ఆలోచిస్తే స్వయం కృషితో సాధించిన సామ్రాజ్యాన్ని కాపాడుకోలేను."

"సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలి అంటే ముందు మిమ్మల్ని మీరు కాపాడుకోవటం నేర్చుకోవాలి"

"నా స్థానంలో వున్నవాళ్ళకి తప్ప నేను అర్థం కాను కృషీ" జవాబు నాశించనట్టుగా ఫోన్ క్రెడిల్ చేశాడు.

ఏదో కసి, ఉక్రోషం-

నవలని పక్కన పడేసిన కృషి ఉద్వేగంగా పైకిలేచింది.

ఓ మేజర్ సర్జరీ కూడా మార్చలేకపోయింది తాతయ్యని. ఇలా కొనసాగితే తాతయ్య ఏమవుతాడు.

అది గ్రాండ్‌పా ఏటిట్యూడ్ మూలంగా రగిలిన క్రోధమో లేక విశ్రాంతిని మరిచి ఇంకా ఎప్పటిలాగే బ్రతకటాన్ని ఇష్టపడే ఉపాధ్యాయపై కోపమో వెంటనే హోండ కారులో బయలుదేరింది యునివర్శిటీ లైబ్రరీకి.

బాల్యం నుంచి ఒంటరిగా బ్రతకడమే అలవాటైన కృషికి ఇష్టమైన విషయం పుస్తకాలు సంగీతం ఇవి రెండే.

0 0 0 0

ఉదయం

తొమ్మిదిన్నర కావస్తోంది.

భాగ్యనగరం రోడ్లు రద్దీగా వున్నాయి.

ఆకాశంలో ఎండ క్రమంగా తీవ్రమవుతోంది.

కారులో స్టీరియో ఆన్‌చేసింది కృషి. మడోన్నా 'లైక్ ప్రేయర్' మనస్సుకేదోలాంటి ఆహ్లాదాన్ని అందిస్తోంది.

అయోధ్య హోటల్‌దాటి లక్డీకాపూల్ చేరుకుంటూ అలవోకగా ఫుట్‌పాత్‌వేపు చూసిన కృషి అదిరిపడింది.

నెమ్మదిగా నడుచుకుంటూ వెళుతున్నాడు ధూర్జటి.

నిన్న సాయంకాలం పోలీసులు అరెస్ట్ చేస్తే అప్పుడే బయటకెలా వచ్చాడు.

పట్టించుకోకుండా ముందుకు వెళ్ళిపోయేదే కాని వున్నట్టుండి నిన్న రాత్రి కలతో పాటు ట్రాఫిక్ ఐలాండ్ దగ్గర రెడ్ లైట్ వెలగడంతో కారాపింది.

సరిగ్గా ఇదే అవకాశం కోసం చూస్తున్నాడేమో ధూర్జటి గభాలున ఫ్రంట్ డోర్ తెరిచి ఆమె పక్కసీటులో కూర్చున్నాడు.

అనుకోని సంఘటనకి తత్తరపడుతూ "మిస్టర్ ధూర్జటీ" అంది కృషి సీరియస్‌గా

అతడిలో తొట్రుపాటు లేదు. యథాలాపంగా అన్నాడు. "గ్రీన్ లైట్ పడింది ట్రాఫిక్ జామ్ చేయక కారు ముందుకు పోనివ్వండి"

"అసలు నువ్వు" కారుని పోనిచ్చిన కృషి ఆవేశంగా అడిగింది "కారెందుకు ఎక్కావ్"

అతడు జవాబు చెప్పలేదు. అసలా ప్రశ్నే వినబడనట్టు బయటికి చూస్తున్నాడు.

అతడి నిర్లక్ష్యానికి మండిపడుతూ రవీంద్ర బారతి దాటుతుండగా అంది "ప్లీజ్ గెటవుట్"

అనడమే కాదు రేడియో స్టేషన్ ముందు ఆపేసింది కూడా.

"వెరీ బేడ్" చిరుకోపంగా అన్నాడు.

"ఏమిటి"

"సరిగ్గా ఆకాశవాణి ముందు మీరు కారాపడం"